

# బుద్ధుడు - గాంధీ

**- రాహుల్ సాంకృత్యాయన్**

*(1893 ఏప్రిల్ 9న ఉత్తరప్రదేశ్ ప్రాంతం అజాంఘర్ జిల్లా కనైల చక్రఫనపూర్‌లో జన్మించిన రాహుల్ సాంకృత్యాయన్ తన 50 సంవత్సరాల జీవితంలో 45 సంవత్సరాలు పర్యటనలలో గడిపారు. బుద్ధుని సిద్ధాంతాలతో మమేకమై తన పేరు రాహుల్‌గా మార్చుకున్న ఈ మహాపండితుడికి హిందీ, సంస్కృతం, పాళీ, భోజ్‌పురి, ఉర్దూ, పర్షియన్, మిగహి, అరబిక్, టిబెటన్, సింహళం, ఫ్రెంచి, రష్యన్, తమిళం, కన్నడం, ఇలా చాలా భాషలు తెలుసు. ఆయన సామాజికం, చరిత్ర, తత్వం, బౌద్ధం, టిబెటాలజి, లెక్సికోగ్రఫి, వ్యాకరణం, సైన్స్, జానపద విజ్ఞానం, రాజకీయాలు ఇలా పలు అంశాల మీద వంద దాకా రచనలు రాశారు. 'ఓల్గా సే గంగా' బాగా ప్రఖ్యాతమైన రచన. 1863లో 'పద్మభూషణ్' గౌరవం పొందిన రాహుల్ సాంకృత్యాయన్ శ్రీలంక విశ్వవిద్యాలయంలో టీచింగ్ వృత్తిని స్వీకరించారు. దయాబెటిస్, రక్తపోటు, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలతో సతమతమై 1863 ఏప్రిల్ 14న డార్జిలింగ్‌లో కన్నుమూశారు.)*

**మ**నది సుదీర్ఘ చరిత్రగల దేశం. ఇక్కడ ఎందరో మహాపురుషులు జన్మించారు. వీరందరిలో బుద్ధుడు నిస్సందేహంగా గొప్పవాడు. ఆయనది సర్వాంగీణ వ్యక్తిత్వం, బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన తన పరివర్తనవాదం (క్షణిక వాదం)లో జగత్తు క్షణ–క్షణం పరివర్తన చెందే ప్రవాహధార లాంటిదని చెప్పాడు. అనాత్మవాదం, ప్రతీత్య సముత్పాదంలో– ఒక పదార్థం నశించిన

తర్వాత మరొకదానిని ఉత్పత్తి జరుగుతుందని చెప్పాడు. ఇలాంటివాటిలో ప్రతి ఒక్కటి ఆయన సృజనాత్మక ఆలోచనాసరళికి ఉజ్వల ఉదాహరణ. కాని ప్రస్తుతం నేను మానవుని ఆలోచనాసరళికి ఆయన ఏ ఏ సిద్ధాంతాలు ప్రసాదించారు అనే అంశాన్ని గురించి చర్చించడం లేదు. రండి, ఆయన బోధనలైన మానవత్వం, ప్రేమ, విశ్వ బంధుత్వం, ఉదారత, వీటిపైన దృష్టి సారిద్దాం. మహాత్ముడైన బుద్ధుణ్ణి సరిగా అర్థం చేసుకోలేక పోయినవారు కొందరు ఆయన వ్యక్తివాది అయిన మహాపురుషుడని, వైయక్తిక నిర్వాణమే ఆయన లక్ష్యమని భావిస్తారు. కాని అది సత్యం కాదు. ఆయన వ్యక్తివాది కాదు. ఆయన జీవితంలోని సంఘటనను ఇందుకు ఋజువుగా చూపించవచ్చు. ఒకసారి ఆయన సవతి తల్లి ప్రజాపతి గౌతమి తను స్వయంగా వడికి నేసిన గుడ్డ ఆయనకు కానుకగా ఇచ్చింది. అప్పుడు ఆయన ఇలా అన్నాడు: "ఈ గుడ్డ బౌద్ధ సంఘానికి ఇవ్వు, దానివల్ల నీకు మరింత ఔన్నత్యం కలుగుతుంది. ఎందుచేతనంటే వ్యక్తి కంటే సంఘం గొప్పది, ఉన్నతమైనదీను." ఇంతేకాక "ఇతరులను ఉద్ధరించడం కోసం ఆత్మత్యాగం చేస్తూ మీరు అసంఖ్యాక జన్మలెత్తవలసి ఉంటుంది" అని శిష్యులకు బోధించే ఆయన సిద్ధాంతం వ్యక్తివాదానికి చెందిన సిద్ధాంతం కాజాలదు.

ఆయన అన్ని ప్రాణుల శ్రేయస్సు కోరేవారు. "సబ్బే సత్తా భవంతు సుఖీ సత్తా." అలా అని ఆయనను నిష్క్రియాపరుడైన స్వప్నదర్శిగా భావించకూడదు. ఆయన యథార్థవాది. అందువల్ల తన శిష్యమండలిని కార్యక్షేత్రంలో దిగమని, బౌద్ధధర్మ ప్రచారం చేయమని ఆదేశించినప్పుడు ఆయన సమస్త ప్రాణుల శ్రేయస్సు కోసం శ్రమించమని చెప్పలేదు. బహుజనుల హితం కోసం, బహుజనుల సుఖం కోసం (బహుజన హితాయ బహుజన సుఖాయ) సంచరించండి అని చెప్పాడు. బహుజనుల హితము, బహుజనుల సుఖము ఒక్కొక్కప్పుడు కొందరి హితానికి, సుఖానికి విరుద్ధంగా ఉంటుందని ఆయనకు తెలుసు. సమాజం పరస్పర విరుద్ధమైన విభిన్న వర్గాల హితాలతో కూడి ఉంటుంది.

ఆయన అభిప్రాయం ప్రకారం ఆదిమానవులు ఏ పద్ధతిలో సృష్టిలోని సంపదలను వినియోగించుకునేవారో, అదే ఆదర్శమైన పద్ధతి. ఆనాటి సమానత్వాన్ని రూపుమాపి స్వీయ సంపత్తి సేకరణకు జన్మనిచ్చిన లోభం మానవుని మౌలిక అపరాధం. దీని కారణంగా మానవ సమాజం ఇంతవరకు ఎన్నో కష్టాలు అనుభవిస్తూ వచ్చింది. మున్ముందు కూడా అనుభవిస్తూ ఉంటుంది. బుద్ధుని అభిప్రాయం ప్రకారం స్వీయ సంపత్తికి సంబంధించిన ఆ లోభం నుండే చౌర్యగుణం పుట్టింది. ఆ తర్వాత కలహాలు, హత్యలు పుట్టుకొచ్చాయి. ఈ దుర్నీతుల నుండి తప్పించుకొనేందుకే మానవుడు రాజును ఏర్పరచుకున్నాడు. మానవ సమాజంలోని జబ్బుకు వేరే మందు అతనికి దుర్లభమైంది.

బుద్ధుడు తన పద్ధతిలో భిక్షువులు, భిక్షిణిల మధ్య సామ్యవాదాన్ని నెలకొల్పడానికి ప్రయత్నం చేశాడు. కానీ, అది చాల కాలం నిలదొక్కుకోలేక పోయింది. కారణం ఏమిటంటే– రాజు, రివాజుల మద్దతు పొంది ఉన్న స్వీయసంపత్తిని పెంచుకోవాలనే వ్యక్తిగత లోభ సముద్రంలో సామ్యవాదపు ద్వీపాన్ని నిలువరింపచేయడం సాధ్యం కాదు. ఆయన తన ఆఖరు ఉపదేశంలో ఇలా అన్నాడు. "వైరం ద్వారా వైరం శాంతించదు" (నహి వైరేణి వైరాణి శామ్యన్తీహ కదాచన–సంస్కృతం). క్లుప్తమైన ఈ కథనంలో మనకు బుద్ధుని మూలాధారమైన కొన్ని తాత్త్విక సామాజిక ఉపదేశాలు లభిస్తాయి.

ఇక బుద్ధుని తర్వాత సంపూర్ణ మానవ సమాజానికి ఇంత గొప్ప సందేశం ఇచ్చిన మహాపురుషుడు గాంధీ ఒక్కడే. ఆయన తత్త్వ దర్శనంలో బుద్ధునిలో ఉన్న మౌలికత లేదు.

తాత్త్విక నేపథ్యం నుండి వేరుచేసి చూసినపుడు గాంధీ మహాత్ముని సత్యము, అహింస ఒక వ్యక్తిలోని వ్యామోహం (fad)గానే కనిపిస్తాయి. గాంధీజీ సమస్త మానవులకు చెందినవాడు. ఆయన జీవనపర్యంతం బహుజనుల హితం కోసం పోరాడారు. వారి శ్రేయస్సే కోరేవాడు కాబట్టి, ఈ లక్ష్యాన్ని

సాధించేందుకు ఆయన బుద్ధుని కంటే కూడా ఎక్కువగా కష్టాలు సహించవలసి వచ్చింది అని అనడానికి నేను సందేహించను. అంటే నా ఉద్దేశ్యం అలాంటి పరిస్థితుల్లో, ఆ వాతావరణంలో ఉండి ఉంటే బుద్ధుడు అలాంటి చర్యలు తీసుకోవడానికి జంకేవాడు అని చెప్పడం కాదు. బాటసారులపై ప్రాణాంతకంగా దాడిచేస్తూ ఉండిన అంగుళీమాలుణ్ణి తెలిసి–తెలిసి ఆయన ఎదిరించాడు కదా! కాని, బుద్ధుని జీవితంలో అలాంటి సందర్భాలు చాల తక్కువగా కనిపిస్తాయి. ఇతరులను రక్షించటం కోసం మహాత్మాగాంధీ కొన్ని వందల సార్లు తన ప్రాణాన్ని పణంగా పెట్టవలసి వచ్చింది. జాతి భేదాలను రూపుమాపడానికి, వేలాది ప్రజల ప్రాణాలు రక్షించడానికి గాంధీజీ దక్షిణాఫ్రికాలో తన ప్రాణాలను లెక్కచేయకుండా బోయర్లతో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాడు. కలకత్తా, ఢిల్లీ, తదితర చోట్ల మత సామరస్యాన్ని స్థాపించేందుకు ఆయన చేసిన అనేక ప్రయత్నాలు ఎవరికి తెలియవు? ఆయన నిజంగా ఒక మహాత్ముడు అనడంలో ఎవరికైనా సందేహం ఉంటుందా?

వ్యక్తిని, సంపూర్ణ సమాజాన్ని ప్రేమించే విషయంలో గాంధీజీ రెండవ తథాగతుడు. ఆయన అవైర భావం (అహింస) లో అకర్మణ్యతకు చోటులేదు. అకర్మణ్యత దుర్బలత్వానికి, సోమరితనానికి చిహ్నం. లక్షలాది భారతవాసులను కర్మక్షేత్రంలోకి రమ్మని పిలుపునిచ్చిన ఆయన అహింస నిషేధాత్మక (నెగెటివ్) శక్తికాదు. తప్పనిసరిగా అది ఒక సునిశ్చితమైన, సుదృఢమైన శక్తే. ఈ విధంగా కూడా ఆయన కర్మను బోధించే గురువు.

దేవుణ్ణి, అపరివర్తన శీలమైన జగత్తును స్వీకరించే తాత్త్విక దృష్టిని నమ్మినవాడైనప్పటికీ, గాంధీజీ కార్యాచరణలో జడత్వం లేదు. ఆయన నరనరాల్లో నిండివున్న బహుజనుల శ్రేయస్సు గురించిన ఆలోచన ఆయనకు తెలియకుండానే తన వ్యక్తిత్వంలో మార్పు చేసుకొనేందుకు ఆయనను మెల్లమెల్లగా సంసిద్ధుని చేస్తూ ఉంటుంది. ఆయన బుద్ధుని గతిశీల తత్త్వదృష్టిని తన లక్ష్యంగా స్వీకరించకపోవడం విచారకరమైన విషయం. చాలా రోజుల

నుండి మనకు గాంధీజీ కొత్తరూపం ఒకటి కనపడుతూంది. ఆయన భారత ప్రజల రాజకీయ స్వాతంత్ర్యంతోనే తృప్తి పడేట్టుగా కనిపించడం లేదు. ఆయన వారి ఆర్థిక స్వాతంత్ర్యం గురించి కూడా ఆలోచించడం ఆరంభించాడు. ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నప్పుడే నిజమైన సామాజిక విప్లవం వస్తుంది. బుద్ధునిలాగానే ఆయన కూడా సమాజంపైన కొద్దిమంది పెత్తనం చెలాయించడం వల్ల సమాజంలో వ్యాపించిన అసమానత కారణంగా ఏర్పడిన దుష్పరిణామాల తీవ్రతను బాగా అర్థం చేసుకున్నాడు. దేశంలోని రాజుల నిరంకుశత్వాన్ని బాహాటంగా దూషిస్తున్నారు. దీని ద్వారా మన పెద్ద పెద్ద సమస్యల పట్ల ఆయన వైఖరి మనకు తెలుస్తూనే వుంది. ఆయన సమాజవాదాన్ని గురించి కూడా మాట్లాడుతారు. కాని సత్యం, అహింస వీటిపైననే ఆయనకు మక్కువ ఎక్కువ. సమాజవాది అయినవాడు ఎవడూ సత్యానికి శత్రువు కాదు. అలాగే సమాజవాది అయినవాడు ఎవడూ హింసకోసమే హింసను కోరుకోడు. నిజానికి సమాజ వాదులుకాని, సామ్యవాదులుకాని, హింసను ఆత్మరక్షణకు అవసరమైన సాధనంగా మాత్రమే స్వీకరిస్తారు. అది కూడా ఎప్పుడు? సమస్యకు శాంతియుతమైన పరిష్కారం సాధ్యపడనప్పుడు, దుండగులు హింసామార్గాన్ని అవలంబించి బాహాటంగా దాడి జరిపినప్పుడు.

రానున్న కొద్ది కాలంలోనే పెట్టుబడిదారుల, నిరంకుశ వర్గాల భరింపరాని ప్రత్యేక హక్కులను అంతమొందించేందుకు గొప్ప పోరాటం ఆరంభం కాబోతూంది. తన అహింసకుండే క్రియాశీలమైన శక్తి కారణంగా గాంధీజీ పీడక వర్గానికి చెందిన దుండగుల కంటే ఎంతో శక్తిమంతుడని నా నమ్మకం, నా ఆశ. ఆయన ఒక రక్తబిందువు కూడా చిందించకుండా జీర్ణించిన, వ్యర్థమైన జమీందారీ పద్ధతిని నిర్మూలించి, సమాజంలో నుండి కొన్ని వర్గాల దోపిడీని, అత్యాచారాన్ని మరెన్నడూ కానరాకుండా పారద్రోలుతాడు. మనకున్న సమయం చాలా తక్కువ. మనమందరం ఆయన దీర్ఘాయువు కోసం ప్రార్థిద్దాం. అయినా గాంధీజీ జీవితానికి కూడా ఒక హద్దు ఉందికదా ! మహాత్మాజీ ఈ విషయంలో త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటారని, అహింసాత్మకమైన ఆ గొప్ప విప్లవానికి

నాయకత్వం వహించి, ఆర్థికపరమైన వర్గభేదాన్ని రూపుమాపి నిజమైన దేశ యజమానులుగా ప్రజలను నిలుపుతారని భావించవచ్చా? ఆయన నాయకత్వం దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం ఇచ్చింది. ఈ నాయకత్వాన్ని చరిత్ర, మానవ సమాజం ఎల్లప్పుడు గుర్తుంచుకుంటాయి. ఒకవేళ ఈ వృద్ధాప్యంలో గాంధీజీ పరిపక్వత చెందిన తన అనుభవ బలంతో భారతదేశ ప్రజలకు ఆర్థిక బంధనాల నుండి, కొన్ని వర్గాల అత్యాచారాల నుండి విముక్తి కలిగించడంలో సఫలీకృతుడైతే అప్పుడు ఆయన తన సమస్త శ్రేయోభిలాషతో బుద్ధుడు కూడా చేయలేకపోయిన పని చేసిన వాడవుతాడు. ఇది జరిగినప్పుడు మానవుల ఆనందాన్ని సాధించే విషయంలో మహాత్మాగాంధీ బుద్ధభగవానుని అధిగమిస్తాడు. చరిత్ర ఆయనను ఈ రూపంలోనే గుర్తుంచుకుంటుంది కదా!



అనువాదకులు
9818431620

(గాంధీజీ జీవించి ఉన్నరోజుల్లో రాహుల్ సాంకృత్యాయన్ ఇంగ్లీషులో రాసిన వ్యాసానికి హిందీ అనువాదం 'ఆజ్‌కల్' (ఢిల్లీ) అనే పత్రికలో అచ్చయింది. ఆ హిందీ వ్యాసానికి డా॥ జె. ఎల్. రెడ్డి తెలుగు సేత ఇది. 'మిసిమి', జూలై, 2005.)

---

## వ్యాసానువాద పూర్వరంగం

**(టి. రవిచంద్, మిళింద ప్రచురణలు, బాపట్ల 2017లో వెలువరించిన 24 పేజీల బుక్‌లెట్ నుంచి)**

*రాహుల్ సాంకృత్యాయన్ గాంధీజీ జీవించి ఉన్నప్పుడే 'బుద్ధుడు– గాంధీ' అనే ఈ వ్యాసాన్ని మొదట ఆంగ్లంలో రాశారని ఆ తర్వాత అది హిందీ భాషలోకి అనువాదమైందని రాహుల్ సాంకృత్యాయన్ సాహితీమిత్రుడు, ఆయన జీవిత చరిత్రకారుడైన ప్రభాకర్ మాచ్వే 1978 సం॥లో రాహుల్జీ జీవిత చరిత్రలో పేర్కొన్నాడు. అయితే రాహుల్జీ ఆంగ్లంలో రాసిన మూలవ్యాసం లభించటంలేదని, దాని హిందీ అనువాదం గాంధీజీ*

మరణానంతరం 'ఆజ్‌కల్' (గాంధీజీ ప్రత్యేక సంచిక) అనే హిందీ పత్రికలో 1948 సం॥లో ప్రచురింపబడిందని కూడా మాచ్వే తెలిపారు. అంతేకాకుండా హిందీ వ్యాసం నుండి "బుద్ధుడు–గాంధీజీ"కి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ఉల్లేఖనల్ని హిందీ నుండి ఆంగ్లంలోకి అనువాదం చేసి రాహుల్జీ జీవిత చరిత్రలో పొందుపరిచారు. "బుద్ధుడు–గాంధీ" వ్యాస ప్రాముఖ్యాన్ని ప్రభాకర్ మాచ్వే బాగా గుర్తించారు. అందువల్లనే హిందీ నుండి ఆంగ్లంలోకి అనువాద భాగాల్ని హిందీయేతర పాఠకుల దృష్టికి తీసుకొచ్చారు. రాహుల్ సాంకృత్యాయన్ మేధాపరిణామాన్ని (ఇంటలెక్చ్యువల్ ఇవల్యూషన్) తెలియపరిచే ఈ వ్యాసం 1947–1957 నాటి ఆయన రచనల్లో చాలా ప్రధానమైంది. ఈ దశాబ్దకాలంలోనే ఆయన ఆధునిక భారత సమాజాన్ని తీవ్రంగా ప్రభావితకం చేసిన ఇద్దరు ఆధునిక భారతీయులు– గాంధీజీ, డా॥ అంబేద్కర్‌లపై అరుదైన రెండు వ్యాసాల్ని రచించారు. ఈ రెండు వ్యాసాలు భారతదేశ చరిత్రను, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి బాగా తోడ్పడతాయి.

1942 సం॥లో హజారీబాగ్ సెంట్రల్ జైలులో రాహుల్జీ రాజకీయ ఖైదీగా ఉన్నప్పుడు 'వైజ్ఞానిక్ భౌతికవాద్' హిందీ భాషలో రచించారు. దీన్ని కీ॥శే॥ ఆలూరి భుజంగరావు వారి తనయ కవిని ఆలూరి తెలుగులోకి అనువదిస్తే నవచేతన పబ్లిషింగ్ హౌస్ వాళ్ళు 2015 సం॥లో ప్రచురించారు. ఈ గ్రంథంలో గాంధీజీ తాత్విక దృక్పథంపై రాహుల్జీ తీవ్రమైన విమర్శ చేశారు. మరొక అయిదారు సంవత్సరాలకు రాసిన 'బుద్ధుడు–గాంధీ' వ్యాసంలో గాంధీజీపట్ల రాహుల్జీ ప్రతికూల ధోరణి (నెగెటివ్ యాటిట్యూడ్) పూర్తిగా మారిపోయింది. ఈ పరిణామాన్ని, మార్పుని చాలామంది గుర్తించలేదు. అందరూ 'వైజ్ఞానిక భౌతికవాదం'లో గాంధీజీపై రాహుల్జీ చేసిన తీవ్ర విమర్శ ప్రభావంలోనే ఉండిపోయారు. ఆయనను ఎంతగానో

అభిమానించే 'వైజ్ఞానిక భౌతికవాదం' తెలుగు అనువాద ప్రచురణకర్తలు కూడా 1947-1948 ప్రాంతాల్లో రాహుల్జీ సైద్ధాంతిక దృక్పథంలో వచ్చిన మౌలికమైన ఈ మార్పును గుర్తించలేకపోయారు. (చూడుము: ప్రచురణకర్తల మాట, రావు కృష్ణారావు, సంపాదకవర్గ సభ్యుడు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2014.)

భారతదేశ చరిత్రలో బుద్ధుడి తర్వాత అంత గొప్పవాడు గాంధీజీ అని "బుద్ధుడు-గాంధీ" వ్యాసం(1947-1948) లో రాహుల్జీ స్పష్టంగా అభివర్ణించారు. ఆయన జీవితంలో ఇది చాలా ముఖ్యమైన మార్పు. ఈ మార్పుని గుర్తించలేకపోతే ఆధునిక భారతదేశ చరిత్ర మనకు స్పష్టంగా, పూర్తిగా అర్థం కానట్లే! ఎవరెన్ని విమర్శలు చేసినా, ఎంతగా తూలనాడినా గాంధీజీ, డా॥ అంబేద్కర్‌లు ఆధునిక భారతదేశ చరిత్రలో విలక్షణ వ్యక్తులు.

*గాంధీజీ గురించి కొన్ని విషయాల్లో రెండు దశాబ్దాల క్రితం నాకు కూడా ప్రతికూలాభిప్రాయమే ఉండేది! మార్క్సిస్టుగా, బౌద్ధధర్మ అధ్యయనవేత్తగా రాహుల్జీ మేధా జీవితంలో వచ్చిన మార్పులాంటిదే నా జీవితంలో కూడా సంభవించింది. అందుచేతనే ఆయన గాంధీజీ, డా॥ అంబేద్కర్‌లపై రాసిన రెండు వ్యాసాలపై ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడింది. దానిలో భాగంగా రాహుల్జీ అజ్ఞాత, విస్మృత రచన 'నవదీక్షిత బౌద్ధులు' (డా॥ అంబేద్కర్ బౌద్ధ ధర్మ సమర్థన) హిందీ నుంచి డా॥ మలయశ్రీ గారిచేత తెలుగు చేయించి మా మిళింద ప్రచురణలు తరుపున 2002 సం॥లో ప్రచురించాను. ఈ పుస్తకం ప్రాముఖ్యతను గుర్తించిన ప్రముఖ పత్రికా సంపాదకులు, సాహితీవేత్త డా॥ ఎ.బి.కె.ప్రసాద్ 'ఆంధ్రప్రభ' దినపత్రికలో "రాహుల్జీ నవదీక్షిత బౌద్ధులు" శీర్షికతో సంపాదకీయమే రాశారు. ఆయన తమ సంపాదకీయంలో మా గత ప్రచురణ మహాకవి అశ్వఘోషుని "వజ్రసూచి" (వర్ణవ్యవస్థ ఖండన), రాహుల్జీ 'నవదీక్షిత బౌద్ధులు' చారిత్రక విశిష్టతను విశ్లేషిస్తూ, మా కృషిని కొనియాడారు. 'నవదీక్షిత

బౌద్ధులు' వ్యాస ప్రచురణ నేపథ్యం గురించి నేను రాసిన రెండు వ్యాసాల్లోని ఒక వ్యాసం– "డా॥ అంబేద్కర్ బౌద్ధధర్మ దీక్షను సమర్థించిన మార్క్సిస్టు దార్శనికుడు రాహుల్ సాంకృత్యాయన్" మిసిమి (జూలై, ఆగస్టు–2002) పత్రికలోనే వచ్చింది. ఆ సందర్భంలోనో, ఆ తర్వాతనో నాటి మిసిమి సంపాదకులు అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారితో ఫోనులో సంభాషిస్తూ 'బుద్ధుడు–గాంధీ'పై రాహుల్ సాంకృత్యాయన్ హిందీలో రాసిన వ్యాసం గురించి చెప్పాను. ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ఆచార్యులుగా పనిచేస్తున్న డా॥ జె. లక్ష్మీరెడ్డిగారి ద్వారా ఈ వ్యాసాన్ని తెలుగులోకి అనువాదం చేయించి 'మిసిమి' (జూలై 2005) లో ప్రచురించారు. ఈ వ్యాసం దీనిలో వచ్చి దశాబ్దం దాటింది. ఆంధ్రదేశంలోని రాహుల్జీ సాహిత్యాభిమానులు ఎంతమంది దృష్టికి ఈ వ్యాసం వెళ్ళిందో తెలియదు. కాని ఈ మధ్య వెలువడిన రాహుల్ సాంకృత్యాయన్ 'వైజ్ఞానిక భౌతికవాదం' ప్రచురణకర్తల దృష్టికి కూడా ఈ వ్యాసం వెళ్ళినట్లు లేదు. అందువల్లనే ప్రచురణకర్తలు రాసిన ముందుమాటలో ఇలా అన్నారు. "రాహుల్జీ ఈ గ్రంథంలో రాధాకృష్ణన్, గాంధీల తాత్విక దృక్పథాలను ఘాటుగా విమర్శించారు. దీన్ని కూడా సైద్ధాంతిక పోరాటంలో భాగంగానే చూడాలి" (రావు కృష్ణారావు, 2014). అయితే 1947–1957 సంవత్సరాల్లో రాహుల్జీ సైద్ధాంతిక దృక్పథంలో చాలా మార్పులు వచ్చాయి. ఈ మార్పుల్ని తెలుగు అనువాద ప్రచురణకర్తలు గుర్తించలేదు. రాహుల్జీ జీవితాన్ని, ఆయన భావాల్ని అమితంగా ఇష్టపడే సైద్ధాంతిక నిబద్ధత గల ప్రచురణకర్తలే ఈ మార్పుని, పరిణామాన్ని గుర్తించలేక పోయారంటే, సామాన్య పాఠకుల సంగతి ఏమిటి? అంతేకాకుండా ఈ మధ్య (21–06–2017) ప్రముఖ విప్లవ సాహితీవేత్త, రాహుల్జీ రచనల తెలుగు అనువాదకుడు, రాహుల్ సాహిత్య సదనం వ్యవస్థాపకుడు కీ॥శే॥ఆలూరి భుజంగరావు వర్ధంతి సభలో 'రాహుల్ సాంకృత్యాయన్–భారతీయ సంస్కృతి'పై స్మారకోపన్యాసం చేస్తున్నప్పుడు

నేను గమనించిన విషయం ఆ సభకు విచ్చేసిన బుద్ధిజీవులైన శ్రోతలకు కూడా రాహుల్ సాంకృత్యాయన్ జీవితంలోని ఈ పరిణామ దశలపట్ల అంతగా అవగాహన లేదనిపించింది. భారతీయ సంస్కృతి గురించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక గుర్తింపును తీసుకొచ్చిన రాహుల్ సాంకృత్యాయన్ లాంటి ప్రసిద్ధులు గురించి రాసేటప్పుడు వాళ్ళ జీవితాల్లోని వివిధ దశల్ని (మార్పుల్ని) విమర్శకులు తప్పనిసరిగా గుర్తించాలి. 2015 సం॥లో తెలుగు అనువాదంగా వెలువడిన రాహుల్జీ 'వైజ్ఞానిక భౌతికవాదం' (1942) చదివిన వాళ్ళు ఆయన 1947 సం॥లో రాసిన 'బుద్ధుడు-గాంధీ' వ్యాసం కూడా చదవాలి. అప్పుడే రాహుల్జీ సైద్ధాంతిక దృక్పథంలో ఎటువంటి మార్పు వచ్చిందో గ్రహించగలరు. 1942 సం॥లో గాంధీజీని పూర్తిగా ప్రతికూల దృక్పథంతో తిరస్కరించిన రాహుల్జీ 1947 నాటికి గాంధీజీని ఇలా అభివర్ణించారు: "గాంధీజీ సమస్త మానవులకు చెందినవాడు. ఆయన జీవన పర్యంతం బహుజనుల హితం కోసం పోరాడారు. వారి శ్రేయస్సు కోరేవాడు కాబట్టి, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఆయన బుద్ధుని కంటే కూడా ఎక్కువ కష్టాలు సహించవలసి వచ్చింది, అని అనడానికి నేను సందేహించను. కలకత్తా, ఢిల్లీ తదితర చోట్ల మతసామరస్యాన్ని స్థాపించేందుకు ఆయన ప్రయత్నాలు ఎవరికి తెలియవు? ఆయన నిజంగా ఒక మహాత్ముడు అనడంలో ఎవరికైనా సందేహం ఉంటుందా?"

రాహుల్ సాంకృత్యాయన్ రచనల్లో "బుద్ధుడు-గాంధీ" వ్యాసాన్ని ఒక చారిత్రక పత్రం (హిస్టారికల్ డాక్యుమెంట్)గా పరిగణించాలి. ఎందుకంటే ఈ దేశంలో కొన్ని శక్తులు గాంధీజీని ప్రగతి నిరోధి (రియాక్షనరీ)గా చిత్రిస్తున్నాయి. ఈ దాడిని, విమర్శను ఎదుర్కొని గాంధీజీని నిజమైన విప్లవకారుడి (రివల్యూషనరీ)గా నిలబెట్టాలంటే రాహుల్ సాంకృత్యాయన్ రాసిన వ్యాసం ఎంతో విలువైనది. ఆయన అంతర్జాతీయ

*స్థాయిలో భారతీయ సంస్కృతి నిజమైన ప్రతినిధిగా బుద్ధుడ్ని నిలబెట్టాడు. అటువంటి బుద్ధుడితో రాహుల్జీ చరిత్రలో ఇద్దరు మహనీయుల్ని పోల్చాడు. ఆ ఇద్దరు–కారల్ మార్క్స్, మహాత్మాగాంధీ. బుద్ధుడి తర్వాత భారతదేశంలో అంతటి మహనీయుడు ఎవరైనా జన్మించాడంటే ఆయన గాంధీయేనని రాహుల్ సాంకృత్యాయన్ నిశ్చితాభిప్రాయం. ఆయన ఈ విషయాన్ని ఈ వ్యాసంలోనే కాదు మరొక గ్రంథం 'నా జీవనయాత్ర' (స్వీయ జీవిత చరిత్ర)లో కూడా పేర్కొన్నారన్న సంగతి నేపాలీ పరిశోధకురాలు, వియన్నా (ఆస్ట్రియా) విశ్వవిద్యాలయంలోని దక్షిణాసియా, టిబెటన్, బౌద్ధ అధ్యయన శాఖలో ఆచార్యులుగా పనిచేస్తున్న అలాకా ఆత్రేయ చుడాల్ తమ పరిశోధనా గ్రంథమైన 'రాహుల్ సాంకృత్యాయన్ జీవిత చరిత్ర' (ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, న్యూఢిల్లీ, 2016)లో కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీ ఆ విషయంతోనే తృప్తిపడేట్టు కనిపించటం లేదు. ఆయన భారత ప్రజల ఆర్థిక స్వాతంత్ర్యం గురించి కూడా ఆలోచించటం ప్రారంభించాడు. ఆయన భారతదేశ ప్రజలను ఆర్థిక బానిసత్వం నుండి కూడా విముక్తి చేయగలిగితే చరిత్రలో ఆయన బుద్ధుడ్ని కూడా మించిపోతాడని రాహుల్జీ ఈ వ్యాసంలో ఆశించాడు. ఆ కల నెరవేరకముందే మహాత్ముడు మనల్ని వదిలి వెళ్ళిపోయాడు. ఈ విధంగా ఆయన చరిత్రలో 'బుద్ధుడ్ని అధిగమించే' పాత్ర నిర్వహించలేకపోయినా 'మానవీయ వారసత్వ' రూపకల్పనలో బుద్ధుడితో సమానంగా ఆధునిక భారతదేశ చరిత్రలో నిలిచిపోయాడు గాంధీజీ.*

* విలక్షణ అనే పదాన్ని కొన్ని సందర్భాల్లో ప్రతికూలార్థంలో కూడా ఉపయోగిస్తుంటారు. ఈ పదానికి భిన్నార్థాలున్నాయి. నేను పూర్తిగా పాజిటివ్ సెన్స్‌లోనే ఉపయోగించాను. ఈ ఇద్దరు 'ప్రత్యేక' (Special) మైన తాత్విక, సామాజిక దృష్టితో ఆధునిక భారతీయ సమస్యల్ని పరిశీలించారు, విశ్లేషించారు. ఈ కోణంలో గాంధీజీ, డా॥అంబేద్కర్‌లు 'స్పెషల్ అండ్ అవుట్‌స్టాండింగ్'లనే నా అభిప్రాయం.